సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.రేష్మి పెరుమాళ్

బండ్లగూడ: విద్యార్థులకు చిన్ననాటి నుంచే సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.రేష్మి పెరుమాళ్ అన్నారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హైదర్షాకోట్‌లోని గౌతం మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాల్గొనప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నాయని, పిల్లలు ఫోన్లు ఉపయోగించే సమయంలో మేసేజ్, వాట్సాప్, తదితర మాధ్యమాల్లోని లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఫోన్లు ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే క్షణాల్లో సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని డబ్బులు కాజేస్తారన్నారు. సైబర్ నేరాలపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్న ఎస్ఐ ప్రభాకర్ 9440107976కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పయనం

అత్తాపూర్: బిహార్‌లో జరగనున్న 12వ జాతీయ పాఠశాలల అండర్–13 బాలికల చెస్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు తెలంగాణ నుంచి ఎంపికైన అత్తాపూర్‌కు చెందిన జి.శివాంశిక సోమవారం బయలుదేరివెళ్లింది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ పోటీల్లో మొత్తం 63 మంది అండర్–13 విభాగంలో పాల్గొంటుండగా.. తెలంగాణ నుంచి 4వ ర్యాంకర్‌గా శివాంశిక పాల్గొని 10 రోజుల పాటు వివిధ కేటగిరిల్లో పోటీ పడనున్నది. అత్తాపూర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పీఈటీలు కరుణాకర్, భవానీ అన్నారు. శివాంశిక లాంటి క్రీడాకారులకు ఆర్థికంగా సహకరిస్తే రాష్ట్రంతో పాటు దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకుస్తారని ఉపాధ్యాయులు, పెరెంట్స్ కమిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మధుబన్‌కాలనీలో కార్పొరేటర్ పర్యటన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, వీధి లైట్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, లిక్కి వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మయ్య, రాజవర్ధన్ రెడ్డి, చిన్న , వెంకట్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ధనంజయ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహాడ్‌లో సమస్యలు పరిష్కరించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ధనంజయ్ గగన్ కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో భాగంగా కాలనీవాసులతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కమిషనర్ రవికుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, వీధి లైట్లు, సీసీ రోడ్లు , డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాలనీ అధ్యక్షుడు పూల వెంకటేశ్ , ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ వి శ్రీశైలం, గండయ్య ఉన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు...

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.ధనుంజయ ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని గగన్‌పహాడ్ బస్తీలో నెలకొన్న పారిశుధ్య, వీధిలైట్లు, సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్ తదితర సమస్యలపై ఆయనకు వినతి ప్రతం అందజేశారు. విలేజ్ ప్రెసిడెంట్ పూల వెంకటేశ్, వైస్ ప్రెసిడెంట్ జె.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. శ్రీశైలం, గండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రాలు అందిస్తున్న చైర్మన్, కమిషనర్లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సకాలంలో సేవలందించడంతో పాటు మురుగునీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న పలువురు సిబ్బందికి సోమవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ వర్కర్లుగా పనిచేస్తున్న రవి, కె.రాజు, నరేందర్, ఆర్. రాజు, మహేందర్‌కు మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ వారిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న తాము వారికి సకాలంలో సేవలందించాల్సిన బాధ్యత కూడా తమపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, నాయకులు ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డీజిల్ చౌర్యం.. లారీ పట్టివేత

శంషాబాద్: డ్రైవర్లపై నమ్మకంతో వాహనాలు అప్పగిస్తున్న వారు.. రోడ్డు పక్కన వాహనం ఆపి గంటల తరబడి మరిచిపోతున్న వారు తస్మాత్ జాగ్రత్త.! మీ వాహనంలో అకస్మాత్తుగా డీజిల్, పెట్రోలు అయిపోతుందంటే..ఆలోచించాల్సిందే..? శంషాబాద్ పట్టణంలోని ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌గూడ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఓ ట్యాంకర్ వాహనాన్ని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం సాయంత్రం ఆపి పరిశీలించగా 350 లీటర్ల డీజిల్ ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి విచారించగా చంగిచర్లలో ఉన్న తమ యజమాని సూచన మేరకు వాహనాల డ్రైవర్ల నుంచి అక్రమంగా డీజిల్ కొనుగోలు చేయడంతో పాటు ఆపి ఉన్న వాహనాల నుంచి డీజిల్‌ను సేకరిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఎస్ఓటీ పోలీసులు నిందితుడిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే నిల్చున్న ప్రయాణికులు

షెల్టర్లు శిథిలం..!

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదుచోట్ల నిర్మాణం
- ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..
- బస్సుల కోసం రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బస్సుల కోసం రోడ్లపైనే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

నిలువ నీడ లేకపోవడంతో..

బస్టాప్‌ల వద్ద షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తలదాచుకునేందుకు చోటులేక లగేజీ, పిల్లాపాపలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో బస్ షెల్టర్లు నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా విన్నవిస్తున్నా.. ఫలితం లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిత్యం వేలాది మంది ప్రయాణం..

సిటీ శివారు ప్రాంతం కావడంతో నిత్యం వందల బస్సుల్లో వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు తదితర పనుల నిమిత్తం



ఒకవైపు ఒరిగిపోయిన బస్‌షెల్టర్

వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే వారికి షెల్టర్లు లేకపోవడంతో నిలువ నీడ కూడ లేకుండా పోయింది.

ఐదు బస్ షెల్టర్లు నిర్మించిన తక్కువే..

పోలీస్ అకాడమీ, కాళీమందిర్ చౌరస్తా, పీరం చెరువు కమాన్, బండ్లగూడ, హైదర్షాకోట్, సన్‌సిటీ బస్టాప్‌ల వద్ద ప్రయాణికులకు సౌకర్యాలు లేక రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఈ సెంటర్లు ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్యను చూస్తే ఒక్కొక్క బస్టాప్ దగ్గర ఐదు షెల్టర్లు నిర్మించిన తక్కువేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నాసిరకంగా నిర్మాణాలు..

కార్పొరేషన్ పరిధిలోని పీబీఈయల్ సిటీ రోడ్డు, కాళీ మందిర్ సమీపంలో ఓ సంస్థ వారు కార్పొరేషన్ అధికారుల అనుమతితో గత సంవత్సరంలో కొత్తగా మూడు బస్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. అయితే అవి నాణ్యతతో చేపట్టకపోవడంతో ప్రారంభానికి ముందే ఓ వైపు ఒరిగిపోయాయి. దీంతో అధికారులు ఏదైనా ప్రమాదం జరగకముందే పూర్తిగా తొలగించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థుల ఉద్యమాలపై చిన్నచూపు తగదు

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవేళ్ల మహేందర్

ఏజీవర్సిటీ: విశ్వ విద్యాలయ భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు గత 28 రోజులుగా ధర్నాలు చేస్తుంటే వారి ఉద్యమాలను చిన్నచూపుగా చూడడం తగదని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవేళ్ల మహేందర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల భూములు హైకోర్టుకు కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేస్తున్న ధర్నాకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం మాట్లాడుతూ నూతన హైకోర్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వానికి చెందిన హెచ్ఎండీఏ, ఎండోమెంట్‌కు చెందిన ఎన్నో భూములు ఉన్నాయని వాటిలో నుంచి కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములు ఇస్తామంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది యువకులతో



విద్యార్థులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

10 వేల సెంటర్లలో ఒకేసారి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. వ్యవసాయానికి సంబంధించిన పరిశోధనలు బాగా జరగాలని ఉత్తమ ఫలితాలు రావాలనే ఉద్దేశంతో విశ్వవిద్యాలయానికి నాడు 2500 ఎకరాలు కేటాయించారన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం ఇందులోని కొన్ని భూములను ఇతర సంస్థలకు కేటాయించిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన తప్పులే ఈ సర్కారు చేస్తే ఊరుకునేది హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులతో పాటు విద్యార్థులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

- ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్
- గంధంగూడలో 'గావ్ చలో.. ఘర్ చలో'

బండ్లగూడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మరోసారి సత్తా చాటుతుందని ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. గండిపేట మండల పరిధిలోని గంధంగూడలో 'గావ్ చలో.. ఘర్ చలో' పేరుతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మూడోసారి కూడా ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చి మోదీ ప్రధాని అవుతారన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేయలేని ఎన్నో అభివృద్ధి పనులు ప్రధానీ మోదీ కేవలం పదేళ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. తెలంగాణలో 10 ఎంపీ స్థానాలు, 35 శాతం ఓట్లను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370, అయోధ్యలో రామాలయం ఇలా అనేక జటిలమైన సమస్యలను అలవోకగా పరిష్కరించామన్నారు. అంతేగాకుండా రక్షణ, రవాణా, అంతరిక్షం, చంద్ర మండలం, మేకిన్ ఇండియా రంగాల్లోనూ దూసుకుపోతున్నామని తెలిపారు. మన విదేశాంగ విధానాలకు ప్రపంచమే దాసోహం అయ్యిందని. ఇప్పుడు శత్రు దేశాలు భారత్ వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, ఇవన్ని మోదీ చతురతతోనే సాధ్యమయ్యిందన్నారు. చేవెళ్లలో 6 లక్షల మెజార్టీతో గెలిచేలా ప్రణాళిక రూపొందించామని, నేతలంతా అప్రమత్తంగా ఉండి వచ్చే రెండు నెలలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, నాయకులు బొక్క నర్సింహ్మారెడ్డి, మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో మల్లన్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప కల్యాణం, బోనాలు, సాయంత్రం ఒగ్గుకథ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామం నుంచి గంపలతో సామూహికంగా బయలుదేరిన గ్రామస్తులు ఆలయానికి చేరుకుని అక్కడే బోనాలను సిద్ధం చేసుకున్నారు. లింగాలను తెచ్చి స్థాపన చేశారు. సాయంత్రం బోనాలతో బీరప్ప ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం నిర్వహించిన ఒగ్గుకథ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, మాజీ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, డి.లక్ష్మణ్,



బీరప్పను దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్

ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి డి. భాస్కర్ కురుమ పాల్గొన్నారు. మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాల కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయకమిటీ నాయకులు పిలుపునిచ్చారు.



నార్సింగి సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ సీఐగా వచ్చిన జి.హరికృష్ణారెడ్డిని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు సహకారం అందిస్తామని, అక్రమాలు, అన్యాయాలు చేసే వారిని ఉక్కు పాదంతో అణచి వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గండయ్య, రాము, వెంకటేశ్, గిరిధర్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌లు తొలగించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజావసరాలకు కమ్యూనిటీహాల్, డ్వాక్రా భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెట్టిన బ్యాలెట్ బాక్స్‌లను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, కౌన్సిలర్ ఉషారాణి కలెక్టర్ శశాంకను కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి కేటాయిస్తే ప్రజావసరాల కోసం తమ నిధులతో భవనాలు నిర్మిస్తామన్నారు. అలాగే పంచాయతీ భవనాన్ని అభివృద్ధి చేసి వార్డు కార్యాలయంగా వాడుకుంటామని కోరామన్నారు. కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి త్వరలోనే అనువైన స్థలాన్ని ఎంపిక చేసి వాటిని తరలిస్తామని హామీనిచ్చారని వారు పేర్కొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి యువకుడి మృతి

అత్తాపూర్: బిల్డింగ్ పైనుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ మన్నాన్ (22) 15 రోజుల క్రితం ఉపాధి కోసం సులేమాన్‌నగర్‌కు వలస వచ్చి డైమండ్ స్కూల్ వెనుకాల ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మన్నాన్‌ను సులేమాన్‌నగర్‌లోని 232 పిల్లర్ నంబర్ దగ్గర పని చేసేందుకు ఖలీల్ ఉర్ రెహమాన్ తీసుకెళ్లాడు. సాయంత్రం పని అయిపోయిన తర్వాత నాలుగో అంతస్తులో సిమెంట్ మాల్ కింద పడిపోవడంతో ఎత్తుతున్నాడు. ఈ క్రమంలో మన్నాన్ ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స కోసం మైత్రి ఆసుపత్రికి ..అక్కడి నుంచి ఉస్మానియా దవాఖానకు తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



మున్సిపల్ డిప్యూటీ ల్యాండ్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న జైపాల్ రెడ్డి

రాజేంద్రనగర్: ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు నాయకులతో కలిసి రాజేంద్రనగర్ మున్సిపల్ డిప్యూటీ ల్యాండ్ కమిషనర్‌ను సోమవారం కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చాలీ చాలనీ వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేసి పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికుడు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల కార్యదర్శి టి.ఆనంద్, అధ్యక్షుడు ఎ.సాయిలు, సహాయ కార్యదర్శి ఎ.రాజు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు

మణికొండ: ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని వర్గాల కార్మికుల సమ్మెలో తాము పాల్గొననున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో గండిపేట మండల ఆశ వర్కర్లు నార్సింగిలోని ప్రభుత్వాసుపత్రిలో మండల వైద్యాధికారి పద్మజకు సోమవారం నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు లత, శంకరమ్మ, శ్రీదేవి, స్వప్న, కవిత, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

రాజేంద్రనగర్: ఆశ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డీఎం అండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని ఒకవైపు ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఆచరణలో మాత్రం పెట్టడం లేదన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఈ విషయమై పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని లేకుంటే అన్ని పీహెచ్‌సీ సెంటర్లలో విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, ఆశ వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమ వారం మెహిదీపట్నంలోని ఎంపీ గార్డెన్‌లో జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. యూనైటెడ్ వే, డిబిఎస్ టెక్ వారు నిర్వహించిన ఈ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఎన్నో మెగా జాబ్ మేళాలు నిర్వహించడం జరిగిందన్నారు. వెస్ట్ సౌత్ జోన్ అదనపు డీసీపీ అథరుద్దీన్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ సైతం జాబ్ మేళాలను నిర్వహిస్తుందన్నారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కలహాలతోనే కాపురాలు విచ్ఛిన్నం

గోల్కొండ: అపోహలు, కలహాలతో పచ్చని సంసారాలు విచ్ఛినం అవుతున్నాయని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆయన కుటుంబం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులు కలిసి ఉంటేనే సుఖంగా జీవించగలుగుతారని ఆయన అన్నారు. పెళ్లి చేసుకొని కొందరు విడిగా ఉండేందుకు తమ కుటుంబ పెద్దలతో అనవసరంగా కలహాలకు దిగుతారని ఆయన అన్నారు. కుటుంబం నుంచి విడిపోవడం మంచిదే కానీ వివాదాలు సృష్టించుకోవడం మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ పెద్దలు తమ కోడలిని కన్నకూతురిలాగా చూసుకుంటామని తమ మధ్య ఉన్న కోపతాపాలను మరచి ఇంటికి తిరిగి వెళ్లారు.

ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

నాంపల్లి: ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. మొదటి రోజు 76 హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరు అయ్యారు. వైద్య పరీక్షల కార్యక్రమానికి మధ్య మండలం డీసీపీ హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పాల్గొన్నారు. హబీబ్‌నగర్ పోలీసులు వైద్య పరీక్షల ఏర్పాట్లను పూర్తి చేశారు.